
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



కరీంనగర్



రామడుగు మండలం

లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి అనే రైతు 14 ఎకరాల్లో వరిసాగు చేశాడు. 15 రోజుల క్రితమే వరి కోతలు పూర్తిచేసుకున్నాడు. కొనుగోలు కేంద్రాలు తెరిచారు కానీ కొనుగోళ్ళు మాత్రం ప్రారంభించలేదు. ఎప్పుడు కొంటారో ఎవరూ చెప్పలేని పరిస్థితి. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు 2,320రూపాయలు మద్దతు ధర ఉండగా ఆయన 1,930 రూపాయలకే చొప్పదండిలోని రైసుమిల్లుకు అమ్ముకున్నాడు. క్వింటాల్‌కు 390 రూపాయల నష్టంతో 400 క్వింటాళ్ల ధాన్యాన్ని అమ్ముకుని 1.56 లక్షల రూపాయలు నష్టపోయాడు.



చొప్పదండికి చెందిన రైతు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి నాలుగు ఎకరాల్లో వరిసాగు చేశాడు. 15 రోజుల క్రితం వరి కోశాడు. వర్షం పడడంతో ట్రాక్ హార్వెస్టర్‌తో పొలం కోయించాల్సి వచ్చి 10వేల రూపాయలకు బదులు 18 వేల రూపాయల ఖర్చయింది. ధాన్యాన్ని తీసుకవచ్చి వెదురుగట్ట సమీపంలోని కొనుగోలు కేంద్రంలో పోశాడు. ఎప్పుడు వర్షం వస్తుందో.. కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లు అందుబాటులో లేవు. ఎండిన ధాన్యం తడిసిపోతుందని ఆందోళన పడి 14 టార్పాలిన్లను రోజుకు 280 రూపాయలకు కిరాయికి తీసుకొని వచ్చి ధాన్యంపై రాత్రిపూట కప్పుతున్నాడు. ఇప్పటికే టార్పాలిన్లకు నాలుగు వేల రూపాయల కిరాయి అయింది. ధాన్యం ఆరబెడుతున్న సమయంలోనే రెండు సార్లు వర్షం వచ్చి కొంత మేరకు తడిసింది. ఆయన వంద క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో పోసి కొనుగోళ్ళు ఎప్పుడు ప్రారంభమవుతాయోనని ఎదురుచూస్తూ కేంద్రంలోనే గడుపుతున్నాడు.



హుజురాబాద్ మండలం

రంగాపూర్ గ్రామానికి చెందిన రెడ్డబోయిన లావణ్య భర్త తొమ్మిది నెలల క్రితం చనిపోయాడు. కుటుంబ బాధ్యతను తీసుకుని తనకున్న భూమిలో వ్యవసాయ చేస్తోంది. కోతలు పూర్తి చేసుకొని 40 క్వింటాళ్ల వడ్లను కొనుగోలు కేంద్రానికి తరలించింది. ఆ పంట అమ్మి అప్పుకట్టాల్సి ఉన్నది. 10 రోజులుగా ధాన్యాన్ని కాపాడుకుంటూ కొనుగోలు కేంద్రంలోనే పడిగాపులు పడుతున్నది. వర్షం పడితే ధాన్యం తడిసి మద్దతు ధర వస్తుందో రాదోనని ఆందోళన చెందుతున్నది.

6 జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరి కోతలు ప్రారంభమై 40 రోజులు దాటింది. కుప్పలు, తెప్పలుగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి చేరుతోంది. ప్రతి గ్రామంలోనూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గడిచిన పదేళ్లుగా వరి ధాన్యాన్ని కొంటుతున్నారు. ఈసారి కూడా అదే విధంగా అంతా సజావుగా సాగిపోతుందనుకున్న రైతులకు తీరని సమస్య వచ్చి పడింది. రైసు మిల్లర్లకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఒప్పందం కుదరక పోవడం ధాన్యం కొనుగోళ్లకు ఆటంకంగా మారింది.

◆ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్



బొమ్మకల్‌లో ధాన్యం ఆరబోస్తున్న మహిళలు

అ(వ)రి గోస..

● ధాన్యం నిల్వ ఎక్కడ?

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొన్న వెంటనే దానిని నిర్దేశించిన మిల్లులకు తరలించాల్సి ఉంటుంది. మిల్లర్లు ఈ ధాన్యాన్ని బియ్యంగా మార్చి కొంత ప్రభుత్వానికి చెల్లించి, మరికొంత మార్కెట్‌కు తరలించి అమ్ముకుని వ్యాపారంచేసుకుంటున్నారు. చాలా మంది మిల్లర్లకు ఇది పెట్టుబడి లేని వ్యాపారంగా మారింది. ప్రభుత్వం పెనాల్టీ విధించినా సకాలంలో బియ్యం చెల్లించని వారు ఎందరో ఉన్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి ఆయా మిల్లుల మిల్లింగ్ కెపాసిటీని బట్టి దానికి ఎంత ధాన్యం కేటాయించాలో నిర్ణయించి ఆ ధాన్యానికి బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని, కొంత సొమ్ము డిపాజిట్ చేయాలని ప్రభుత్వం షరతులు విధించింది. దీనికి మిల్లర్లు అంగీకరించక పోవడంతో ధాన్యం కొనుగోలు చేస్తే ఎక్కడ నిలువ చేయాలో

● సర్కార్‌కు మిల్లర్లకు తేలని పంచాయతీ
● ప్రారంభంకాని కొనుగోళ్లు
● కేంద్రాల్లో పేరుకుపోతున్న ధాన్యం
● తక్కువధరకు ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లకు అమ్ముకుంటున్న అన్నదాతలు

అర్థంకాని పరిస్థితి నెలకొన్నది. కొను గోళ్లు ప్రారంభించకపోవడంతో కేంద్రాల్లో ధాన్యం పేరుకు పోయింది. ఇప్పుడిప్పుడే కోతలు పూర్తి చేసుకుంటున్న రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకవచ్చే అవకాశం లేక ఎక్కడ స్థలం ఉంటే అక్కడ ఆరబోస్తు న్నారు. ప్రభుత్వానికి మిల్లర్లకు మధ్య 15రోజులుగా చర్చలైతే జరుగుతున్నాయి కానీ పరిష్కారం మాత్రం లభించడం లేదు. దీంతో రైతుల్లో ఆందోళన పెరిగి మద్దతు ధర రాకున్నాప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం అమ్ముకోవడానికి సిద్ధపడుతున్నారు.

● పెరిగిన సన్నరకాల సాగు

ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు 2,320, కామన్ రకానికి 2,300 రూపాయలు మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించింది. ఏ-గ్రేడ్ ధాన్యంగా కొనుగోలు చేసే సన్నరకం వరి ధాన్యానికి 2,320, మరో 500 రూపాయల బోనస్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు మద్దతు ధర కంటే క్వింటాల్‌కు 400 రూపాయలు తక్కువకే 1,800 నుంచి 1,950 వరకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. ప్రభుత్వం

మిగతా 8వ పేజీలో...

త్వరగా ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలి

- బండి సంజయ్‌కుమార్, కేంద్ర హోం శాఖ సహాయమంత్రి

కొనుగోలు కేంద్రాల్లోని వడ్లను రాష్ట్ర ప్రభుత్వం త్వరగా కొనుగోలు చేయాలి. ఇచ్చిన హామీ మేరకు అన్ని రకాల వడ్లకు 500 రూపాయల బోనస్ ఇవ్వాలి. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలని జిల్లా వ్యాప్తంగా సోమవారం తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించాము. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం.

రైస్ మిల్లులను కేటాయించాలి..

- బండారి శేఖర్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను వెంటనే ప్రారంభించి రైతులను మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారుల నుంచి రక్షించాలి. తక్షణమే రైస్ మిల్లులను అలాట్ చేయాలి.. అన్ని రకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలి. వర్షానికి తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనాలి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి.

ప్రజావాణికి 184 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి 184 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ పమెలాసత్పతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిద ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆయ శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ ఖోఖో పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా ఖో-ఖో సంఘ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 4: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్-17 బాలబాలికల ఖో-ఖో పోటీలను సోమవారం నిర్వహించారు. ఖో-ఖో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఖో-ఖో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వై మహేందర్‌రావు క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. బాలికల విభాగంలో తిమ్మాపూర్ మండలం ప్రథమ స్థానం, గంగాధర మండలం ద్వితీయ స్థానం సాధించాయి. బాలుర విభాగంలో మానకొండూర్ మండల ప్రథమ స్థానం, హుజూరాబాద్ మండలం ద్వితీయ స్థానంలో నిలిచాయి. వారికి డీవైఎస్‌వో బి శ్రీనివాస్‌గౌడ్ బహుతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి వేణుగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, మహ్మద్ యూనిస్ పాషా, ఎస్జీఎఫ్ మాజీ కార్యదర్శి పోతన శ్రీనివాస్, నిర్వహణ కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాశ్, ఎ శంకరయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్, డీఈవోకు హైకోర్టు నోటీసులు

కరీంనగర్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ప్రకారం కోరిన సమాచారాన్ని ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఎం .రాజయ్య అనే ఉపాధ్యాయుడు హైకోర్టును ఆశ్రయించాడు. ఈ మేరకు హైకోర్టు కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశంకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

రైతులపై ప్రభుత్వం వివక్ష

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. కరీంనగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనే స్థితిలో లేదన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి నెల రోజులు గడిచినా కొనడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి రైస్ మిల్లులను కేటాయించి కొనుగోళ్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుర్శేడ్ ప్యాక్స్ చైర్మన్ తోట తిరుపతి, కరీంనగర్ ప్యాక్స్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ గోనె నర్సయ్య, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల గొంతు తడిపేందుకే 'అమృత్'

● ప్రతి ఇంటికి నల్లా నీరందిస్తాం
● కరీంనగర్ అభివృద్ధికి కలిసి పనిచేద్దాం
● కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'ప్రజల గొంతు తడిపే అమృత్ అద్భుతమైన పథకం. దేశంలోని ప్రతి ఇంటికి శుద్ధి చేసిన నల్లా నీటిని అందించాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం' అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కరీంనగర్‌లో అమృత్ రెండో విడత పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ నగరాలు, పట్టణాల్లో నివసించే ప్రతి ఇంటికి సరిపడా నీటిని అందించడంతోపాటు, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని ప్రధాని నరేంద్రమోదీ అమృత్ పథకాన్ని ప్రారం భించారని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహించే ఈ పథకంలో ఉమ్మడి జిల్లాకు 852.11 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో అమృత్ తొలివిడతలో 136.56 కోట్లు ఖర్చుచేశామని, దీనితో ప్రతిరోజు నీరు అందించగలుగుతున్నామని చెప్పారు. రెండో విడతలో 145 కోట్లు ఖర్చుచేయాలని నిర్ణయించిందన్నారు. ఇందులో కేంద్ర వాటా 56.46 కోట్లు, రాష్ట్ర వాటా 75.74 కోట్లు, నగరపాలక సంస్థ వాటా 13.30 కోట్లు ఉంటుందని తెలిపారు. పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. గతంలో యూజీడీ పనులు చేసిన కాంట్రాక్టర్ దివాళా తీశాడని, బిల్లులు ఇప్పించాలని తనవద్దకు వచ్చి ప్రాధేయ పడ్డారని చెప్పారు. రాజకీయాలకంటే అభివృద్ధి ముఖ్యమన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు, పగలు పంతాలకు పోతే అభివృద్ధి చేయలేమని, ప్రజల ఆకాంక్ష నెరవేర్చలేమని, అందరం కలిసి కరీంనగర్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుదామని నేతలకు సూచించారు.

● టెంపుల్ సర్క్యూట్‌తో పర్యాటకంగా అభివృద్ధి

త్వరలోనే కొండగట్టు, వేములవాడ, ఇల్లందకుంట ఆలయాలను, ఎల్ఎండీతో కలిపి టెంపుల్ సర్క్యూట్‌గా తీసుకువచ్చి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. దీంతో ఉమ్మడి జిల్లా పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ పూర్తి చేసేందుకు సహకరిస్తామని, కరీంనగర్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం విషయమై టీటీడీ చైర్మన్‌తో మాట్లాడానని, ఆలయ నిర్మాణానికి సహకరిస్తానని సంజయ్ తెలిపారు. పార్టీలకతీతంగా మేయర్ సునీల్‌రావు, పాలకవర్గసభ్యులు కరీంనగర్ అభివృద్ధికి కష్టపడి పనిచేస్తున్నారని, మాజీ మంత్రి గంగుల కమలాకర్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సహకరిస్తున్నాయన్నారు.



అమృత్-2 పనులకు భూమిపూజ చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

● కరీంనగర్ అభివృద్ధి బాధ్యత మాది..

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్

ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ అమృత్-2 పథకం ప్రారంభించడం శుభపరిణామమని అన్నారు. ఈ పనులు పూర్తియితే విలీన గ్రామాల ప్రజలకు 24/7 మంచినీటిని అందించవచ్చని తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో తాను, బండి సంజయ్‌కుమార్ కార్పొ రేటర్లుగా పని చేశామని, నగరాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. నగరంలో త్వరలోనే 24/7 మంచినీటిని అందిస్తామని చెప్పారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేయాలని, కట్ చేసిన రోడ్ల రిస్టోరేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. యూజీడీ నిర్మాణ సమయంలో రోడ్లను తవ్వి వదిలి వేయడంతో డెంగ్యూవ్యాపించి ప్రజలు ఇబ్బందులు పడ్డారని, అలా జరుగకుండా చూడాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. రాజకీయాలకతీతంగా కరీంనగర్‌ను ఆదర్శనగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అమృత్ మ్యాచింగ్ గ్రాంట్స్ నిధులకు ఇబ్బంది కాకుండా చూడాలని, మానేరు రివర్‌ఫ్రంట్, వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం పూర్తయ్యేందుకు చొరవ తీసుకొని సహకరించాలని మంత్రి సంజయ్‌ని కోరారు. మేయర్ యాదగిరి సునీల్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్ పాల్గొన్నారు.

బ్యాంకు గ్యారంటీ నిబంధనతో ఇబ్బందులు

● ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు.. సమస్యలను అర్థం చేసుకోండి
● ప్రభుత్వానికి జిల్లా రైస్ మిల్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి

కరీంనగర్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'ధాన్యం మిల్లింగ్‌కు మిల్లర్లు 10, 20, 25 శాతం బ్యాంకు గ్యారంటీలు ఇవ్వాలనే నిబంధనను రాష్ట్ర ప్రభుత్వం విధించడం సరికాదు.. ప్రస్తుతం ఏ మిల్లు యజమాని కూడా బ్యాంకు గ్యారంటీ ఇచ్చే పరిస్థితిలో లేరు... తప్పుచేసిన మిల్లర్లపై చర్యలు తీసుకోండి... వెంటనే ప్రభుత్వం బ్యాంకు గ్యారంటీ నిబంధనను ఎత్తివేయాలి' అని జిల్లా రైస్‌మిల్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైస్ మిల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి నర్సింగారావు, ప్రధాన కార్యదర్శి తొడుపునూరి కరుణాకర్ మాట్లాడుతూ మిల్లర్లు తీవ్ర నష్టాల్లో ఉన్నారన్నారు. సన్న వడ్లను మిల్లింగ్ చేస్తే ఎన్ని బియ్యం, ఎంత నూక వస్తుందో తెలుపాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని రైస్‌మిల్లులకు ప్రభుత్వం గతంలో చేసిన మిల్లింగ్ చార్జీలు 700 నుంచి 800 కోట్లు బకాయి ఉన్నాయని, వాటిని ఇవ్వకుండా బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలనడం సరికాదని చెప్పారు. ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని, ఎవరైనా తప్పుచేస్తే వారిని శిక్షించాల్సిందేనన్నారు. రా రైస్ మిల్లింగ్ చార్జీలను క్వింటాల్‌కు 150, బాయిల్డ్ రైస్‌కు 200 రూపాయలు ఇస్తే సహకరిస్తామని చెప్పారు. జిల్లాలోని 80శాతం మిల్లర్లు ప్రభుత్వానికి ఎలాంటి బకాయి లేరని, 20 శాతం బకాయి ఉన్నా వారు నష్టపోవడంతో చెల్లి ంచలేక పోయారన్నారు. మిల్లర్లు దొంగలు కాదని తెలిపారు. లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టుకు గ్యారెంటీ తీసుకోకుండా రైసుమిల్లర్ల ను గ్యారంటీ ఇవ్వమనడమేమిటని ప్రశ్నించారు. ఒక్క మిల్లుపై ఆధారపడి దాదాపు 50 కుటుంబాలు జీవిస్తాయని, నీతినిజాయితీతో రైతులకు, ప్రభుత్వానికి సహకరిస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి బియ్యంగా మార్చుతున్న మిల్లర్లను ఎవరూ పట్టి ంచుకోకుండా మోసగాళ్ళుగా చిత్రీకరించడం సరికాదని అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం ఇస్తే బియ్యం పట్టించి ఇస్తామని లేదా క్వింటాల్ ధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు 500 రూపాయలు ఇచ్చి ప్రభుత్వమే బియ్యం, నూక, తవుడు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం క్వింటాల్ ధాన్యానికి గతంలో 10 రూపాయలు ఇచ్చేదని, ఇప్పుడు రా రైస్‌కు 40 రూపాయలు, బాయిల్డ్‌కు 50 రూపాయలు ఇస్తామని చెబుతోందని, అవి విద్యుత్ చార్జీలకు కూడా సరిపోవన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శులు రాజమౌళి, డైరెక్టర్లు ఎలుగూరి రవికుమార్, నీరుమల్ల శ్రీధర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొడుపునూరి కరుణాకర్

డీఎంహెచ్‌వోగా డాక్టర్ వెంకటరమణ



సుభాష్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ వెంకటరమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్‌లో పనిచేసిన ఆయనను ప్రభుత్వం జిల్లాకు బదిలీ చేసింది. జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ సుజాత బదిలీపై హైదరాబాద్ వెళ్లనున్నారు.



ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలి

● తహసీల్దార్లకు బీజేపీ నాయకుల వినతి

◆ కరీంనగర్ రూరల్, ఆంధ్రజ్యోతి

8

సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

● డీఆర్డీవో శ్రీధర్
● మండలాల్లో ఎన్యూమరేటర్లకు శిక్షణ

8

న్యూస్ బాక్స్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన శ్రావ్యశ్రీ

ఓదెల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్ హైస్కూల్లో తొమ్మిదోతరగతి చదువుతున్న రేండ్ల శ్రావ్యశ్రీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైంది. ఉమ్మడి జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన స్కూల్ ఆఫ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో శ్రావ్యశ్రీ షాట్ పుట్‌లో ఉత్తమప్రతిభను కనబరిచి ఉమ్మడి జిల్లాలో ద్వితీయ స్థాయిలో నిలిచింది. దీంతో అండర్17 విభాగంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే అథ్లెటిక్ పోటీలకు ఎంపికైంది. ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ఎంపిక అవ్వడం పట్ల పూర్వవిద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు యేసుదాసు, ఉపాధ్యాయులు, పీఈటీలు పోరెల్ల సదయ్య, తాండ్ర ప్రణయ్ విద్యార్థిని అభినందించారు.

అగ్నిప్రమాదం



ఇంట్లో చెలరేగుతున్న మంటలు

మెట్‌పల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో ఓఇంట్లో సోమవారం సాయంత్రం ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. పట్టణానికి చెందిన జల అనే వివాహిత ఇంట్లో దీపం పెట్టి బయటకి వెళ్లింది. కొద్ది సేపటికి మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న 10 వేల నగదు, ఒక బీరువా కాలి బూడిదైనట్లు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.






మహాబావి

- ఆసియా ఖండంలోనే అతిపెద్దది
- ఒక టీఎంసీ నిలువ సామర్థ్యం
- 92 మీటర్ల లోతు.. 56 మీటర్ల వ్యాసం

ఇల్లంతకుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్ గ్రామ సమీపంలో నిర్మించిన మహాబావి ఆసియా ఖండంలోనే అతిపెద్దదిగా గుర్తింపు పొందింది.

కాళేశ్వరం ప్రాజెక్టు లోని నాలుగో లింక్ ద్వారా 10వ ప్యాకేజీలో భాగంగా అనంతగిరి గ్రామ సమీపంలో అన్నపూర్ణ రిజర్వాయర్ నిర్మించారు. రిజర్వాయర్ నిర్మించే ప్రదేశం ఎత్తుగా ఉండడంతో నీటిని ఎత్తిపోయాలనే లక్ష్యంతో తిప్పాపూర్ సమీపంలో సర్జిపూల్ నిర్మాణ పనులు చేపట్టింది. 92 మీటర్ల లోతు, 56 మీటర్ల వ్యాసంతో మహాబావి నిర్మాణం ప్రారంభించారు. రికార్డు స్థాయిలో 13 నెలల్లో పూర్తి చేశారు. ప్రతీ రోజు ఒక టీఎంసీ నీటిని నిల్వ చేసే సామర్థ్యంతో నిర్మించారు. 3.4 కిలో మీటర్లు కాలువల ద్వారా, 7.6 కిలోమీటర్ల టన్నెల్ ద్వారా మిడ్ మానేరు నుంచి నీటిని తరలిస్తారు. సర్జిపూల్‌లోని నీటిని ఎత్తిపోయడానికి అండర్ పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టారు. పంప్‌హౌస్‌లో నాలుగు భారీ పంపులను ఏర్పాటు చేశారు. ఒక్కో మోటారు రోజుకు 2,800 క్యూసెక్కుల నీటిని సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తుంటాయి.

పంపులు నడవడానికి అవసరమైన విద్యుత్ కోసం సమీపంలోనే 440 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టారు. అండర్ పంప్‌హౌస్‌లోకి తొలుత ఇతరులను ప్రవేశం లేకపోయినా ప్రస్తుతం పర్యాటకులను అనుమతిస్తున్నారు.



అన్నపూర్ణ రిజర్వాయర్, అండర్‌గ్రౌండ్ పంప్‌హౌస్

జాతీయస్థాయి కరాటే పోటీలకు 'ఖని' విద్యార్థులు

గోదావరిఖని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిసెంబరులో పంజాబ్ రాష్ట్రంలో జరగనున్న ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్‌కు గోదావరిఖనికి చెందిన జపాన్ షిటోరియో కరాటే స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల సంగారెడ్డిలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో శ్రీవర్షిని, ఎం.ముక్తిశ్రీ, బి.సహస్ర, సృష్టి, పి.సహస్ర ప్రతిభ కనపర్చి బంగారు, కాంస్య పతకాలు సాధించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా జపాన్ షిటోరియో విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థును జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ప్రెసిడెంట్ తగరపు శంకర్, కార్యదర్శి ఎం రమేష్, పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ సెక్రటరీ కె శ్రీనివాస్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్స్ శ్రీనివాస్, కె శ్రావణ్, నిదిష్‌కుమార్, రోహిత్‌కుమార్, సంజన, అభిజ్ఞ, శివశ్రీ, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బానేష్‌రావు, స్పందన క్లబ్ సెక్రటరీ వీరవిహార్ అభినందించారు.



పతకాలతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయిన విద్యార్థులు

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు వీసీ అభినందన



శాతవాహన ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో వీసీ ఉమేష్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 4: హిమాచల్ ప్రదేశ్‌లో జాతీయ సాహస శిబిరంలో పది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించుకొని వచ్చిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ అభినందించారు. పదిమంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో పాటు ఎస్సారార్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పడాల తిరుపతిని వీసీతో పాటు రిజిస్ట్రార్ వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మనోహర్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కంచు తిరుపతి, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ స్వప్న, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ ఆడెపు శ్రీనివాస్, డాక్టర్ అర్జున్, డాక్టర్ వి రాజేశం, డాక్టర్ గోలి శ్రీనివాస్‌లు అభినందించారు.

సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

కరీంనగర్ అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గాంధీభవన్‌లో ఈ నెల 20న నిర్వహించే కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సేవాదళ్ జిల్లా ఇన్‌చార్జి గుర్రం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. కరీంనగర్‌లోని డీసీసీ కార్యాలయంలో సేవాదళ్ జిల్లా కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలకు జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో సేవాదళ్ కరీంనగర్ నియోజకవర్గ అధ్యక్షులు కాసారపు ఎల్లయ్యగౌడ్, నగర అధ్యక్షుడు తిప్పారపు ఆంజనేయులు, వివిధ మండాలల అధ్యక్షులు, నాయకులు కుమారస్వామి, భద్రేశం, గర్రెపల్లి రవీందర్ పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్ట్

కరీంనగర్ క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో రెండున్నర సంవత్సరాల బాలుడిని కిడ్నాప్ చేసిన కేసులో నిందితుల కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం... గతనెల 27న కరీంనగర్, చాకలివాడలో నివాసముంటున్న షేక్ రేనా తన రెండున్నర సంవత్సరాల కుమారుడిని కిడ్నాప్ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకునేందుకు ఎస్ఐ రాజన్న, కానిస్టేబుల్స్ కుమార్, బషీర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. బాలుడి అచూకీ కోసం గాలించిన ప్రత్యేక టీం సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. కరీంనగర్ చాకలివాడకు చెందిన దాసరి స్వరూప అలియాస్ సరోజ, మోతె కృష్ణ బాలుడిని తల్లి వద్ద నుంచి అపహరించారు. ఆ బాలుడిని సాధనవేణి అలియాస్ బొజ్జ లలియా అలియాస్ లత, సాధనవేణి రమేష్ దంపతులకు 50 వేల వేలుకు అమ్మారు. దర్యాప్తులో ఈ విషయాలను గుర్తించిన పోలీసులు నిందితులైన దాసరి స్వరూప అలియాస్ సరోజ, సాధనవేణి లలియా, రమేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్ విధించారు. మరో నిందితుడు మోతె కృష్ణ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ కోటేశ్వర్

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



వేంపేట శివారులో రేషన్ బియ్యంను పట్టుకున్న పోలీసులు

మెట్‌పల్లి రూరల్, నవంబరు, 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపేట గ్రామం నుంచి అక్రమంగా ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా సోమవారం రాత్రి సీఐ నిరంజన్‌రెడ్డి పట్టుకున్నారు. ప్రజలకు పంపిణీ చేసిన రేషన్ బియ్యాన్ని గ్రామంలో సేకరించిన వాటిని అక్రమంగా తరలిస్తునారని వచ్చిన సమాచారంతో ఎస్సై-2 రాజుతో కలిసి వేంపేట శివారులో వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానస్పదంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలానికి వెళ్తున్న టీఎస్01యూసీ5721 నంబర్ గల ఆటోను ఆపి తనిఖీ చేశారు. వాహనంలో సుమారు 22కింటాళ్ల బియ్యాన్ని సంచుల్లో తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనంతో పాటు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిర్మల్ జిల్లాకు చెందిన ఎండీ హైదర్ అను ఆటో డ్రైవర్ ఎలాంటి అనుమతులు లేకుండా బియ్యాన్ని ఖానాపూర్ మండలానికి తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. దీంతో రేషన్ బియ్యంతో పాటు వాహనం, ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ అదేశాల మేరకు ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేసుకుని స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులకు అప్పగిస్తామన్నారు. అనంతరం ఆటో డ్రైవర్‌పై చర్యల నిమిత్తం మెట్‌పల్లి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

నేడు నాగుల చవితి



పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు (ఫైల్)

కరీంనగర్ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగోపాసన, సర్పపూజ అనాదిగా వస్తున్న ఆచారం. నాగజాతి విష్ణువుకు తలగడగా, గొడుగుగా, ఆసనంగా, పాదుకలుగా, శివునకు అలంకారంగా, గణపతికి యజ్ఞోపవీతంగా ఉన్నట్లు పురాణ కథలున్నాయి. నాగులను కుండలినీ శక్తిగా భావించి ఆరాధిస్తారు. ఈ దిశలో కార్తీక శుక్ల చతుర్థి నాగులు ఆవిర్భవించిన నాగుల చవితిని మంగళవారం జరుపుకోనున్నారు. ఉపవాసాలు పాటిస్తూ పుట్టల్లో పాలు పోసి, పాలు, నెయ్యి కలిపిన నువ్వులు, బియ్యపు ముద్దలను నైవేద్యంగా పెడతారు. సర్పసూక్తం, అనంత నాగేంద్ర, సుబ్రహ్మణ్యేశ్వ రస్తుతులతో అభిషేక, అర్చనాదులు చేసి, పుట్టమట్టిని బంగారంగా భావించి తిలక ధారణ చేసుకుంటారు.

క్రైం కార్నర్

పురుగుల మందు తాగిన యువకుడి మృతి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యా ల గ్రామానికి చెందిన పంది మధుకర్(30) అనే యువకుడు పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పంది మధుకర్ నిత్యం మద్యం తాగుతూ ఇంటికొచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. మద్యం తాగవద్దని వారించిన అతడి భార్యతో గొడవపడ్డాడు. క్షణికావేశంలో అక్టోబరు 30న తన ఇంటిలో పురుగుల మందు తాగాడు. గమ నించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు మధుకర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య..

ఇల్లందకుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూజునూర్ గ్రామానికి చెందిన దుండ్ర లత (38) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లత కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యు లు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందు తూ సోమవారం మృతి చెందింది. లత భర్త కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజ కుమార్ తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు..

రామగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగెపల్లి శ్మశాన వాటిక వద్ద ఆదివారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి చిట్యాల సమ్మయ్య(45) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం చిట్యాలకు చెందిన సమ్మయ్య కొయ్యూరు నుంచి నాగెపల్లి గ్రామానికి తన బంధువుల ఇంటి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రామగిరి మండలం నాగెపల్లి శ్మశాన వాటిక వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో పెద్దపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు సమ్మయ్య భార్య చిట్యాల సుగుణ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ..

సిరిసిల్ల క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) సిరిసిల్ల పట్టణం జిల్లా ఆసుపత్రి మార్చురీ వద్ద 55ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సోమవారం ఆసుపత్రి సిబ్బంది చూసి పోలీసులకు సమాచారం అందించారు. చనిపోయిన వ్యక్తి నీలిరంగు షర్టు ధరించి ఉన్నాడు. ఎడమ చేతిపై పుట్టు మచ్చ కలిగి ఉన్నాడు. మృత దేహాన్ని మార్చురీ గదిలో భద్ర పరిచామని, సంబంధీకులు సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

తంగళ్లపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వేల్పుల సంజీవ్(27) అనే యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పది రోజుల క్రితం సంజీవ్ సిరిసిల్ల చెందిన రమేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై సిద్దిపేటకు వెళ్తున్నాడు. జిల్లెల్ల-రామచంద్రపూర్ గ్రామాల మధ్య ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. సంజీవ్ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. రమేష్ పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో రైతుకు గాయాలు

ఇల్లంతకుంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిక్కుడువాని పల్లె గ్రామానికి చెందిన బోయిని నరసయ్య (54) అనే రైతు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. చిక్కుడువాని పల్లెకు చెందిన నర్సయ్య ద్విచక్ర వాహనంపై పెద్ద లింగాపూర్ గ్రామానికి వస్తున్నాడు. ఒక్కసారిగా వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. గాయాలవడంతో వెంటనే 108 వాహనంలో కరీంనగర్ ఆసుపత్రి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ



బ్యాటరీ చోరీకి గురైన ట్రాక్టర్‌ను చూపుతున్న బాధితుడు

గన్నేరువరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్, గుండ్లపల్లి గ్రామాల్లో తొమ్మిది ట్రాక్టర్ల బ్యాటరీలు, 18 ట్రాక్టర్ల హైడ్రాలిక్ పట్టీలను ఆదివారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ల బ్యాటరీలను, హైడ్రాలిక్ పట్టీలను దొంగలించారు. సోమవారం ఉదయం ట్రాక్టర్లను స్టార్ట్ చేయడానికి ప్రయత్నించగా ఎంతకీ స్టార్ట్ కాకపోవడంతో ట్రాక్టర్‌ను పరిశీలించగా బ్యాటరీలు, హైడ్రాలిక్ పట్టీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఒక్కో బ్యాటరీ ఖరీదు సుమారు ఎనిమిది వేలు, ఒక్కో హైడ్రాలిక్ పట్టీ ఖరీదు రెడువేల రూపాయల వరకు ఉంటుందని బాధితులు వారి ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- అవయవదానం చేసిన తల్లిదండ్రులు



మాదాసి సాయి నితీష్ (ఫైల్)

కళ్యాణ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కుమారుడి బ్రెయిన్ డెడ్ అయి పుటెడు దుఖంలో ఉన్న ఆ తల్లిదండ్రులు తమ కుమారుడి అవయవాలను జీవన్‌దాన్ ట్రస్ట్‌కు దానం చేశారు. అక్టోబరు 24న మాతంగి కాలనీవద్ద రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, గోదావరిఖని రమేష్‌నగర్‌కు చెందిన మాదాసి సాయినితీష్ (23) తీవ్రంగా గాయపడ్డాడు. చావు బతుకుల మధ్య పోరాటం చేస్తూ సోమవారం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో మరణించాడు. నితీష్ తల్లిదండ్రులు గుండె, కాలేయం, కిడ్నీలు, కళ్లను జీవన్‌దాన్ ట్రస్ట్‌కు దానం చేయగా యశోద ఆసు పత్రిలోని సిబ్బంది నితీష్‌కు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మల్లేష్, ఉమ మాట్లాడుతూ తమ కుమారుడు బ్రెయిన్ డెడ్ అయి మృతి చెందినా అవయవదానం చేసి ఇతరులకు ప్రాణం పోశాడన్నారు.

●రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందిన రమేష్ నగర్‌కు చెందిన మాదాసి సాయి నితీష్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పరామర్శించారు. వారి తల్లిదండ్రులను ఓదార్చారు.

రంగు మార్చే రాశిగుట్ట


పసుపు వర్ణంలో చేతులు


బలపం రాళ్లు


రాశిగుట్టపై ఆంజనేయస్వామి దేవాలయం

అటవీప్రాంతంలో ఉన్న ఆ గుట్టకు ప్రత్యేకత ఉంది. గుట్టపైకి వెళ్లే సరికి చేతులు, కాళ్లు పసుపు వర్ణంలోకి మారిపోతాయి. గుట్టపై లెటరైట్ శిలలు ఉన్నాయని, అధిక ఉష్ణోగ్రతలు, అధిక వర్షపాతంతో ఆ ప్రాంతంలో ఇలా జరుగుతుందని పరిశోధనల్లో వెల్లడైంది. రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామ శివారులో రాశిగుట్టకు సంబంధించి మరిన్ని విశేషాలు..

- గుట్టపై లెటరైట్ శిలలు
- వాతావరణ మార్పులతో పుసుపు రంగు ధూళి

వీర్నపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం కంచర్ల శివారులోని అటవీప్రాంతంలో రాశిగుట్ట ఉంది. ఈ కొండపైనే వెలిసిన అంజనేయస్వామి ఆలయంలో మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు వెళ్తుంటారు. గుట్టపైకి ఎక్కుతున్న క్రమంలో చేతులు, కాళ్లు పసుపు రంగులోకి మారి పోతుండడాన్ని భక్తులు గమనించారు.

రాశిగుట్ట విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు, పరిశోధకుల బృందం ఇటీవల రాశిగుట్టను సందర్శించింది. బృందం వెల్లడించిన వివరాల ప్రకారం.. గుట్టపై భాగాన లెటరైట్ శిలలు ఉన్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, అధిక వర్షాపాతం ఉన్న ప్రాం తాల్లో ఇవి ఏర్పడతాయి. ఈ శిలలు వాతావర ణానికి ఆక్సీకరణం చెంది గుల్లలు గుల్లలుగా స్పాంజి వలే తయారవుతాయి. జాజు, పసుపు రంగు లేదా నారింజ రంగును సంతరించుకుంటాయి. ఈ క్రమంలో గుట్టపై పసుపు రంగు ఉన్న ధూళి గాలిలోకి చెట్లపైనా, రాళ్లపైనా చేరుతుంది. భక్తులు వాటిని తాకిన సందర్భంలో చేతులకు, గుట్ట ఎక్కుతుండగా పాదాలు పసుపు వర్ణంలోకి మారుతున్నాయి.

వాతావరణ మార్పులతో పసుపు వర్ణం

రత్నాకర్‌రెడ్డి, చరిత్ర పరిశోధకుడు



వాతావరణ మార్పులతోనే రాశిగుట్టపై ఉన్న శిలల నుంచి వచ్చే పసుపు రంగు ధూళిలో కలుస్తోంది. గుట్టపైకి ఎక్కుతున్న క్రమంలో చెట్లు, రాళ్లను తాకినప్పుడు భక్తుల చేతులు, కాళ్లు పసుపు వర్ణంలోకి మారుతున్నాయి. ప్రభుత్వం రాశిగుట్టను ఎకో టూరిజం కింద అభివృద్ధి చేయాలి. రాశిగుట్టకు వెళ్లే దారి చూపే గుర్తులు ఏర్పాటు చేయాలి.


రాసిగుట్ట ప్రాంతం

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు ప్రతిభ


ద్వితీయ స్థానం సాధించిన ఉమ్మడి జిల్లా బాలికల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 4: హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 4 వరకు ఆసిఫాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించింది. ఫైనల్‌లో వరంగల్ జట్టుతో తలపడి ద్వితీయ స్థానం సాధించి నట్లు తెలం గాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా జట్టును డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్ధన్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసి డెంట్ కాసర్ల ఆనంద్ కుమార్, రమణారావు, సంయుక్త కార్యదర్శి నమిలకొం డ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, అమర్, సాయికృష్ణ, దుర్గరాజ్, సురేం దర్, కృష్ణహరి, తదితరులు అభినందించారు.

ఓయూ రిజిస్ట్రార్‌గా రేగడిమద్దికుంట వాసి


గడ్డం నరేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న వైస్ ఛాన్సలర్ కుమార్

సుల్తానాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ రిజి స్ట్రార్‌గా సుల్తానా బాద్ మండలంలోని రేగడిమద్దికుంట గ్రామానికి చెందిన గడ్డం నరేష్ నియమితలయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్‌గా నియమితులైన గడ్డం నరేష్‌కు సోమవారం యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ కుమార్ నియామకపత్రాన్ని అందజేశారు. సుల్తానాబాద్ మండంలోని రేగడి మద్దికుంట వాసి ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమితులు కావడంపై గ్రామస్థులు, నరేష్ చిన్ననాటి స్నేహితులు పల్లా వాసు, మంద శ్రీనివాస్, కొమురెవల్లి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల సమస్యలు పట్టించుకోని ముఖ్యమంత్రి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

పెద్దపల్లిటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలు పట్టించుకోవడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో నూతన జాతీయ విద్య విధానం అమలు చేయబోమని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. విద్యా శాఖ సీఎం వద్దే ఉంచుకొని కనీసం ఇంత వరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఆనాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో చెప్పిన మాటలకు నేడు ముఖ్యమంత్రిగా చేస్తున్న విధానాలకు పొంతన లేదన్నారు. పది సంవత్సరాల కాలంలో గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారన్నారు. వారి వైఖరి కారణంగా విద్యార్థి, యువత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవచ్చు అనే భావనతో కాంగ్రెస్ గెలుపు కోసం పని చేశారన్నారు ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులు లేక, చాల పాఠశాలలు మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా సక్రమంగా లేని పరిస్థితిలో ఉన్నాయన్నారు. సాంఘిక, సం క్షేమ, గురుకులాల ఉన్న విద్యార్థులు సమస్యలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, మాతంగి సాగర్, శివరామకృష్ణ, శ్రీవర్ధన్, అభిరామ్, నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవాలి

కరీంనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల ఉపాధ్యాయ, పట్ట భద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గాలకు చెందిన వారు ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నియోజకవర్గాలకు పదవీ కాలం 2025 మార్చి 29వ తేదీతో ముగుస్తుందన్నారు. ఆన్‌లైన్, ఏఈఆర్టీ కార్యాలయాల్లో నేరుగా ఓటర్లు దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. నవంబరు 23న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తామన్నారు. అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు తెలియజేయ వచ్చన్నారు. డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం ఫారం-18, ఉపాధ్యాయ ఎన్నికల కోసం ఫారం-19లో దరఖాస్తు చేసుకో వాలని కలెక్టర్ సూచించారు.

108లో ఉద్యోగ అవకాశాలు

సుభాష్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ మండలాల్లో గల 108 వాహనాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని జిల్లా మేనేజర్ ఇమ్రాన్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ బీజెడ్‌సీ, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్, బీ- ఫార్మసీ, ఎం-ఫార్మసీ లేక ఇంటర్మీడి యట్‌లో బైపీసీ లేదా ఏదేని మెడికల్ డిప్లొమా చేసినవారు, 25 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వయస్సుగల వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల వారు ఈనెల 6న జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని 108 కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 9100799257 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆలయాల్లో కార్తీక శోభ


కోటిలింగాల, ధర్మపురిలో గోదావరి వద్ద హారతి




ధర్మపురిలో గోదావరి నదిలో దీపాలు వదిలి పెట్టుతున్న మహిళలు

వేములవాడ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది. కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించు కున్నారు. ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివారి దర్శనానికి సుమారు ఐదు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- కార్తీక సోమవారం సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వర స్వామితోపాటు అనుబంధ పరివార దేవతలకు అర్చనలు, అభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం చేశారు.

రాజన్న ఆలయంలో కార్తీక దీపోత్సవం

కార్తీకమాసం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని సోమవారం ఈవో వినోద్‌రెడ్డి ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా లత బృదంతో ఏర్పాటు చేసిన భక్తి విభావరి గానం ఆకట్టుకుంది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కళాకారులను సన్మానించారు.

ఘనంగా మహాలింగార్చన

రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మహాలింగార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

కోటిలింగాలలో గోదావరి హారతి

వెల్గటూర్: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని శైవ క్షేత్రం కోటిలింగాలలో గోదావరి హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మలు శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గోదావరి మాతకు పూజలు చేసి హారతినిచ్చారు. ప్రభుత్వ దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి తెలిపారు. కార్తీక మాసంలో పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో నిత్య దీపోత్సవం, కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు ప్రతీ సోమవారం గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో, ఆలయ అర్చకులు తెలిపారు. ఆలయంలో భక్తులు ఓం, స్వస్తిక్ ఆకారంలో ఆకట్టుకునేలా దీపాలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదావరి హారతి తిలకించారు.

ధర్మపురిలో కార్తీక సందడి

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో సోమవారం కార్తీక సందడి నెలకొంది. కార్తీక మాసం సందర్భంగా భారీగా భక్తులు తరలి వచ్చారు. స్థానిక లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ రామలింగేశ్వర స్వామి, అక్కపల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. నదిలో కార్తీక దీపాలు వదిలారు. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు వద్ద లక్ష వత్తులు వెలిగించి, కార్తీక దామోదరుడిని పూజించారు. గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య నిత్య పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఏర్పాట్లు పరిశీలించారు.

మూడో రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి మూడవ రోజు సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమం నిర్వహించారు.




భక్తజనంతో కిక్కిరిసిన రాజన్న ఆలయ ప్రాంగణం, కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు, స్వామివారి దర్శనం కోసం భక్తుల క్యూ

అరుణాచల గిరి దర్శనానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం

మంథని, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణచల గిరి దర్శనానికి మంథని ప్రాంతం నుంచి వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు డీఎం శ్రావణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ బస్టాండ్ నుంచి అరుణాచలం గిరికి వెళ్లే సూపర్ లగ్జరీ బస్సు సదుపాయాన్ని కల్పించామన్నారు. వెళ్లేటప్పుడు దారిలో ఉన్న కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం, తిరుగు ప్రయాణంలో అలంపూర్ జోగులాంబ టెంపుల్ దర్శనం ఉంటుందన్నారు. ఈనెల 16న రాత్రి 12 గంటలకు బస్సు గోదావరిఖని చేరుకుంటుందన్నారు.ప్రయాణానికి పెద్దలకు రూ.4850, పిల్లలకు రూ. 4000 చార్జీ అవుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు ఆర్. మెండయ్య సెల్ నంబర్ 9949531412ను సంప్రదించాలని సూచించారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా గోదావరిఖని ఆర్టీసీ డిపో నుంచి తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సును నడిపిస్తున్నట్టు ఖని ఆర్టీసీ డిపో డీఎం నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 13న మధ్యాహ్నం 3 గంటలకు గోదావరిఖని బస్టాండ్ నుంచి బయలుదేరి మరుసటి రోజు అరుణాచలానికి చేరుకుంటుందన్నారు. ఒక్కొక్కరికి రూ.4800 చార్జి నిర్ణయించినట్టు తెలిపారు. మరింత సమాచారం కోసం 7382847316, 7382847427 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'ఖని'లో నేడు దాశరథి, జాషువా సాహిత్య సభ

హాజరుకానున్న దేశపతి, కోటేశ్వరరావు

కోల్‌సిటీటౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహాకవి దాశరథి శత జయంతి ఉత్సవాల సందర్భంగా చేతన సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం గోదావరిఖని మార్కండేయకాలనీలోని సిద్ధార్థ హైస్కూల్‌లో దాశరధి, గుర్రం జాషువాల సాహిత్య సదస్సు జరుగనుంది. ఈ మేరకు చేతన సాహితీ సాంస్కృతిక సమాఖ్య బాధ్యులు ఎం.విజయానంద్ ఒక ప్రటనలో తెలిపారు. సాహిత్య సభకు ఎమ్మెల్సీ, గాయకుడు, కవి దేశపతి శ్రీనివాస్, హైదరాబాద్ సీటీ కళాశాల తెలుగు విభాగం డీన్ కోటేశ్వర్‌రావు హాజరవుతున్నారని పేర్కొన్నారు. దాశరధి సాహిత్యంపై దేశపతి, గుర్రం జాషువా కవిత్వంపై కోటేశ్వరరావు ప్రసంగిస్తారని తెలిపారు. కాగా సాహిత్య సభకు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని సాహితీ అభిమానులు, తెలంగాణ వాదులు, సామాజిక వాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎస్‌యూ ఫార్మసీ కళాశాలను పట్టించుకోరా..?



ఎస్‌యూ ఫార్మసీ కళాశాల

- రేకుల షెడ్లలో హాస్టల్
- కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందిపడుతున్న విద్యార్థులు

గణేశ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కళాశాలలో 103 మంది విద్యార్థులు ఉన్నారు. 1980లో ఫార్మసీ కళాశాలకు 42.14 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించారు. తర్వాత అందులో ఐదెకరాల భూమిని ఉర్దూ యూనివర్సిటీకి కేటాయించారు. మిగతా 37.14 ఎకరాల యూనివర్సిటీ భూమి ఎంత కబ్జాకు గురైందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రహరీ నిర్మించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లోయర్ మానేరు డ్యాం సమీపంలో ఎస్సారెస్పీ క్వార్టర్స్‌లో హాస్టల్ నిర్వహిస్తున్నారు. రేకుల షెడ్లు కావడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిస్తే హాస్టల్ గదులు ఊరుస్తుంటాయి. కళాశాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. రాత్రి వేళలో బయటకు వెళ్లాలంటే విద్యార్థులు భయపడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

త్వరలో సమస్యలు పరిష్కరిస్తాం..

ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్



ఫార్మసీ కళాశాలలోని సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం. రూ. 2.2 కోట్లతో ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాం. ఈ ప్రతిపాదనలను యూనివర్సిటీ ఎగ్జిక్యూట్ కౌన్సిల్ ముందుంచి ఆమోదం తీసుకుంటాం. 2.8 కోట్లతో అదనంగా నాలుగు తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాం. హాస్టల్ భవనం నిర్మాణానికి నిధుల మంజూరు కోసం ప్రయత్నిస్తున్నాం.


రేకుల షెడ్లలో హాస్టల్



నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

నేడు ఆర్‌జేడీ విచారణ

కరీంనగర్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావుపై ఉపాధ్యాయ సంఘాలు ఇచ్చిన ఆరోపణల ఫిర్యాదుపై మంగళవారం విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ విచారణ జరుప నున్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించే విచారణకు హాజరై సాక్షాలను చూపించాలంటూ ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులకు లేఖలు పంపించారు.

అనర్హులకు సర్టిఫికెట్ల జారీపై విచారణ చేయాలి

సుభాష్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అనర్హులకు ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారీపై విచారణ చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ జిల్లా ప్రధానకార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిగురుమామిడి మండలంలో తహసీల్దార్ అప్రూవల్ లేకుండా అనర్హులకు ఈబీసీ, ఈడబ్ల్యూఎస్, కులం, ఆదాయం సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని ఆరోపించారు. ఇందులో కంప్యూటర్ ఆపరేటర్, జూనియర్ అసిస్టెంట్, మీసేవ నిర్వాహకుడు కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. అనర్హులకు 40 ఈబీసీ, 20 ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్లు జారీ చేశారని ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌వార్డు రిజిస్టర్‌ను పరిశీలించాలని కోరారు. ఇలాంటి వారి వల్ల అర్హులైన విద్యార్థులు, నిరుద్యోగులు అవకాశాలు కోల్పోతున్నారని వాపోయారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు పొడిగించాలి

సుభాష్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువును పొడిగించాలని పూలే బీసీ సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి అయిలయ్య కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు కోసం ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా పూర్తిస్థాయిలో ఓటరు నమోదు కాదని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇంకా చాలా మంది పట్టభద్రులు నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు.

ప్రభుత్వం గడువును పొడిగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోటేష్‌కుమార్, బండారి లింగయ్య, గడప కోటేష్, పోలే గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తాం



మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

గణేశ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తామని, ఏమైనా సమస్య ఉంటే తల్లిదండ్రుల ద్వారా ఫిర్యాదు చేయవచ్చని నగర కాంగ్రెస్ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనలో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల సోమవారం నగరంలోని మానేరు హోటల్ ప్రక్కన గల ఇంటిగ్రేటెడ్ బాలుర హాస్టల్‌లో సంబరాలు నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, నగర కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హాజరై విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నగర కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్, పీసీసీ కార్యదర్శులు వైద్యులు అంజన్ కుమార్, రహమత్ హుస్సేన్, పీసీసీ ఎస్సీ సెల్ సీనియర్ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి తాజుద్దీన్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేశం పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

హుజూరాబాద్ రూరల్: మండలంలోని ఇందిరానగర్ గ్రామ శివారులోని మైనార్టీ గురుకుల పాఠశాలలోని విద్యార్థినిల సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎన్‌ఎస్‌యూఐ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గండు ప్రశాంత్‌యాదవ్, మండలాధ్యక్షుడు తదితరులు ఉన్నారు.

మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీమంతాలు

కరీంనగర్ రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లిలోని బస్తీ దవాఖానాలో మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మహ్మద్ హసీన బేగం ఆధ్వర్యంలో గర్భిణీలకు సీమంత కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి, మాజీ జడ్పీటీసీ పురమల్ల లలిత, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్‌లు హాజరై చీరె, పూలు పండ్లు, పసుపు, కుంకుమలు అందించి సీమంతాలు జరిపించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఒకటో డివిజన్ అధ్యక్షుడు కొలగాని అనిల్, 20వ డివిజన్ అధ్యక్షుడు ఎట్టెపు వేణు, అనూష, మమత, పద్మ, కవిత, పలువురు ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాస ప్రత్యేక పూజలు



పాతబజార్ గౌరీశంకరాలయంలో క్యూలైన్‌లో భక్తులు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా ఆలయాల్లో ఆధ్యాత్మిక పరవశం వెల్లి విరిసింది. అన్ని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. కరీంనగర్‌లోని పాతబజార్ గౌరీశంకర, కమాన్‌రోడ్ రామేశ్వర, భగత్‌నగర్ భవానీశంకర, చైతన్యపురి మహాశక్తి, జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత, భగత్‌నగర్ అయ్యప్ప, మార్కెట్‌రోడ్, మంకమ్మతోట, జ్యోతీనగర్, కట్టరాంపూర్, విద్యానగర్ వేంకటేశ్వర దేవాలయాలు, యజ్ఞవరాహక్షేత్రం, ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయ స్వామి, రాంపూర్ గిద్దెపెరుమాండ్లు, రాంనగర్ రమాసత్యనారాయణస్వామి, దేవుళ్లపురి పంచముఖ హనుమదీశ్వర, తదితర ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దీపాలను వెలిగించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి

సుభాష్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ జిల్లా ప్రధానకార్యదర్శి బండారి శేఖర్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ధాన్యం కేంద్రాలు ప్రారంభించకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఒకవైపు అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉందన్నారు. అన్నిరకాల వరి ధాన్యానికి రూ. 500 బోనస్ కల్పించాలని డిమాండ్ చేశారు. కొన్ని చోట్ల మిల్లులు అలాట్ చేయకపోవడం వల్ల ధాన్యం ఎక్కడికక్కడ ధాన్యం కల్లాల్లో, లారీల్లో నిలిచిపోయిందన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. తాలు, తప్ప, తరుగు లేకుండా మద్దతు ధర కల్పించాలని, కాంగ్రెస్ పార్టీ హామి ఇచ్చిన మేరకు వరి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు జి ప్రశాంత్‌కుమార్, కె బద్రి, యూత్‌లీగ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదు

కరీంనగర్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం ఇరుకుల్ల గ్రామంలోని వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారని సోమవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కాశిపాక రాజేశం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేశారు. అక్రమ రవాణాపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న వారు ఎంతటి వారైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమతి లేని వాహనాలను ఊర్లోకి రాకుండా పలు నిబంధనలు ప్రవేశపెట్టి, అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరారు. వెంటనే అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై, వత్తాసు పలుకుతున్న అధికారులపై చర్యలుతీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

అ(వ)రి గోస...

(5వ పేజీ తరువాయి)

ఈ సమస్యను పరిష్కరించి వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని, అందరికీ మద్దతు ధర లభించేలా చూడాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 2,75,448 ఎకరాల్లో వరిసాగు చేశారు. వీటిలో 1,56,948 ఎకరాలు దొడ్డు రకాలు కాగా, 1,18,500 ఎకరాల్లో సన్న రకాలను వేశారు. ప్రభుత్వం సన్నరకాల సాగును ప్రోత్సహించాలని నిర్ణయించి క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ప్రకటించడంతో ఈసీజన్‌లో 40 శాతానికిపైగా సన్నరకాలను సాగు చేశారు. దొడ్డు రకాలకు చెందిన వరి ధాన్యం దిగుబడి ఎకరాకు 2.092 టన్నులు, సన్నరకాలు 2.047 టన్నులు వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈమేరకు 3,28,335 మెట్రిక్ టన్నుల దొడ్డు వరి ధాన్యం, 2,42,570 మెట్రిక్ టన్నుల సన్న రకం వరి ధాన్యం దిగుబడిగా రానున్నది. దొడ్డురకాలు మొత్తంగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తారు. సన్నరకాల్లో 55,374 మెట్రిక్ టన్నులు రైతులు విత్తన అవసరాల కోసం, 75,471 టన్నులు స్థానిక అవసరాల కోసం ఉంచుకొని 1,11,725 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తారని అంచనా వేశారు. జిల్లాలో రైతులూ 4,14,282 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయించే అవకాశముండడంతో వీటిని కొనుగోలు చేయడానికి 340 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించి 90 శాతం కేంద్రాలను ప్రారంభించారు. మద్దతు ధర, సన్నరకాలకు క్వింటాల్‌కు 500 బోనస్ ప్రకటించినా కొనుగోలు కేంద్రాలను ఊరూరా ఏర్పాటు చేసినా... కొనుగోళ్ళు ప్రారంభించక పోవడంతో రైతులకు ప్రయోజనం లేకుండా పోతున్నది. పండిన ధాన్యం నిల్వ చేసుకునే చోటులేక, అప్పులు చెల్లించాల్సి ఉన్నందున రైతులు తక్కువ ధరకే ప్రైవేట్‌గా ధాన్యం అమ్ముకోవలసిన పరిస్థితి ఉత్పన్నమైంది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

మంత్రి పొన్నంను కలిసిన వసతిగృహాల అధికారులు

గణేశ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తెలంగాణ వసతిగృహ సంక్షేమసంఘం జిల్లా శాఖ అధికారులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోనాల రవి, సెక్రెటరీ సూర తిరుపతిరెడ్డి, మల్కా రాజేశ్వర్‌రావు, అంజయ్య, రాజశేఖర్, సత్యనారాయణ, సంపత్ కుమార్, శైలజ, రజిత, లక్ష్మి, ధనలక్ష్మి, సౌందర్య, అన్నపూర్ణ, శ్రీదేవి, గోవర్ధన్, రాజేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన



చీరలను కొనుగోలు చేస్తున్న మహిళలు

కరీంనగర్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీరాజరాజేశ్వర కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కళా సిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన పలువురిని ఎంతగానో ఆకట్టుకుంటోంది. దేశంలో పది రాష్ట్రాల్లో తయారు చేసిన చేనేత దస్తుల అమ్మకాలతో పాటు స్టోన్, జువెల్లరీస్, కుర్తా, డ్రెస్ మెటీరియల్, డోర్ కర్టన్స్ , పెరల్స్, ఉడెన్ హ్యాండ్ క్రాఫ్ట్స్, బంజారా కోల్‌కత్తా బ్యాగ్స్, జైపూరీ రాంజీ, ఒరిస్సా హ్యాండ్ క్రాఫ్ట్ వస్తువులు ఈ ప్రదర్శనలో లభిస్తాయి. నవంబర్ 15వ తేదీ వరకు ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయని మేనేజర్ బాజు మండేలా తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ సందర్భంగా ప్రత్యేక డిస్కౌంట్ కూడా ఇస్తున్నామని చెప్పారు. ఇప్పటికే మహిళల నుంచి ఎక్కువగా ఆదరణ లభిస్తోందని, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

కరీంనగర్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామ పరిధిలోని రజ్వీచమన్ కాలనీలో రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని సోమవారం కాలనీ వాసులు కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందించారు. 11 నెలల క్రితం రహదారి నిర్మాణం కోసం ఉన్న రోడ్డు తవ్వి అలాగే వదిలి వేయడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. పది నెలల కిందట పనులను ప్రారంభించి రోడ్డును తవ్వి కంకర పోసి వదలడంతో ఆ రోడ్డు నుంచి వెళ్లాలంటే నరకయాతన పడుతున్నామని పేర్కొన్నారు. రహదారి నిర్మాణం చేపట్టేలా అధికారులను ఆదేశించాలని కాలనీకి చెందిన సయ్యద్ ముజఫర్, అబ్దుల్ మాజీద్, అంజాద్ అలీ, మహమ్మద్ షాహిద్, యూసుఫ్, అలీముద్దీన్, రజ్వీచమన్ సిటిజన్ కాలనీ వాసులు కోరారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు



చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌లో ఉన్న మాజీ సర్పంచ్‌లు

జిల్లాలో 32 మంది కరీంనగర్ క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న 32 మంది మాజీ సర్పంచ్‌లను కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు అరెస్టు చేశారు. జిల్లాలో ఎక్కడికక్కడ తాజా మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అదుపులోకి తీసుకుని వదిలిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 170 కింద శాంతిభద్రతల చర్యల్లో భాగంగా అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

● చిగురుమామిడి: రాష్ట్ర ప్రభుత్వం తమ హక్కులు హరిస్తోందని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ కన్వీనర్ జక్కుల రవీందర్ అన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఆందోళనకు తరలి వెళుతున్న తమను పోలీసులు మధ్యలో అరెస్టు చేయడం బాధాకరమన్నారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు సన్నీల్ల వెంకటేశం, బెజ్జంకి లక్ష్మణ్, గోళి బాపురెడ్డి, నాగెల్లి వకుళ లక్ష్మారెడ్డి ఉన్నారు.

● వీణవంక: మండలంలోని మాజీ సర్పంచ్‌లు కొత్తిరెడ్డి కాంతారెడ్డి, పింగిళి కోమల్‌రెడ్డి, మాల్లారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు.

ఇన్సూరెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయొద్దు

భగత్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇన్సూరెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయవద్దని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా వ్యాన్ అసోసియేషన్ పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గ్రామీణ బీమా జ్యోతి, సురక్ష బీమా కింద వ్యాన్ కార్మికులకు ఈఏడాది ఇన్సూరెన్స్ చెల్లిస్తానన్నారు. వ్యాన్ అసోసియేషన్‌కు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.

ఆడిటోరియం పనులు త్వరగా పూర్తి చేయండి

కరీంనగర్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కళాభారతి ఆడిటోరియం మరమ్మత్తు పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ పమేలాసత్పతి మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కళాభారతి ఆడిటోరియంలో18 లక్షలతో ఆడిటోరియంలో చేపడుతున్న వేదిక, రంగులు, ఎలక్ట్రికల్, సౌండ్ సిస్టమ్, సీటింగ్, మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ యాదగిరి, డీఈఈ అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



రుక్మాపూర్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి, నవంబరు 4: (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ శివశివాని కాటన్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మకుండా పత్తిని కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. అనంతరం చాకుంట, వెదురుగట్టులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అయన ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి'

చిగురుమామిడి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కార సాధనకు మంగళవారం నిర్వహిస్తున్న చలో హైదారాబాద్‌ను విజయవంతం చేయాలని ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు పి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం అందజేత

వీణవంక నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరుకు చెందిన ఎదులపూరం వెంకటేశ్వర్లు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. అమ్మ ఫౌండేషన్ సభ్యులు వెంకటేశ్వర్లు కుటుంబాన్ని సోమవారం పరామర్శించి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో అమ్మ పౌండేషన్ అధ్యక్షుడు గోనెల సమ్మయ్య, సభ్యులు ముద్దసాని శ్రీనివాస్, గంధం సుమన్, షాబొద్దీన్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి



చొక్కారావుపల్లిలో టీకాలు వేస్తున్న పశు వైద్యులు

గన్నేరువరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ సురేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చొక్కారావుపల్లిలో సోమవారం వెటర్నరీ అధికారులు గాలికుంటు టీకా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి రావడం వలన ఆవులు గేదెలు తీవ్ర అస్వస్థతకు గురవుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముస్కు కరుణాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, జూనియర్ వెటర్నరీ అధికారి అభిషేక్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలి



హుజూరాబాద్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. ధాన్యం కొనుగోలు చేయాలని సోమవారం తహసీల్దార్ సీహెచ్ రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ళపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడిశెట్టి సంతోష్ కుమార్, గుంజేటి కుమార్, నాయకులు పాల్గొన్నారు.

● భగత్‌నగర్: బీజేపీ కొత్తపల్లి మండల అధ్యక్షుడు కడార్ల రతన్‌కుమార్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజేష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వేముల అనిల్‌కుమార్, కడారి శాంతశ్రీనివాస్, రేణు, తిరుపతి, ధర్మేంద్ర, ప్రతాప్, అనిల్ పాల్గొన్నారు.

● హుజూరాబాద్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు, ఆర్ కుమార్, బి కరుణాకర్, ఆర్ భాస్కర్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, రాజు, కొంరయ్య, సంజీవ్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

● శంకరపట్నం: బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో తహసీల్దార్ భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, అలివేలు సమ్మిరెడ్డి, కొయ్యడ అశోక్, కనకం సాగర్, శ్రీనివాస్, సాయిప్రకాస్, శ్రీనివాస్, సంపత్, రాజేందర్, శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

● గన్నేరువరం: బీజేపీ నాయకులు తహసీల్దార్ ఇప్ప నరేందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బండి తిరుపతి, రాము, సుమిత్‌రెడ్డి, సత్తయ్య పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కోరె రవీందర్, పల్లపు రవి, మేక సుధాకర్‌రెడ్డి, ఇటికాల స్వరూప, రాజు, రామ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల పై అవగాహన

చొప్పదండి, నవంబరు 4: (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని శ్రీ కృష్ణవేణి హై స్కూల్లో మత్తు పదార్థాల వినియోగంపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు మత్తు పదార్థాలకు బానిసలుగా మారవద్దన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని చేరుకునేందుకు కష్టపడాలన్నారు.

కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సంపత్, మిషన్ పరివర్తన కమ్యూనికేటర్ మాలతి, కృష్ణవేణి హై స్కూల్ కరెస్పాండెంట్ పద్మాకర్‌రెడ్డి, మేడి శంభయ్య, సాంబరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జమ్మికుంట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పొనగంటి సంపత్ అన్నారు. సోమవారం పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావుతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం, సొసైటీ వైస్ చైర్మన్ మామిడి తిరుపతిరెడ్డి, సీఈవో రవీందర్ పాల్గొన్నారు.

● వీణవంక: మండలంలోని గంగారం, ఎల్బాక, చల్లూరు, ఘన్ముక్ల, బొంతుపల్లిలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం సింగిల్ విండో చైర్మన్ మావురపు విజయ భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు మాడ సాధవరెడ్డి పాల్గొన్నారు.

● మానకొండూర్: మండలంలోని కొండపల్కల, గంగిపల్లి, చెంజర్ల, ఖాదర్‌గూడం, అన్నారం, సదాశివపల్లి, లింగాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్‌విండో చైర్మన్ నల్ల గోవిందరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు పంజాల శ్రీనివాస్, డైరెక్టర్లు కుర్ర వెంకటస్వామి, ముల్కల సుధారాణి, వాల అంజుత్‌రావు పాల్గొన్నారు.

● గన్నేరువరం: మండలంలోని ఖాసింపేట, పారువెల్ల, హన్మాజిపల్లి, మైలారం, సాంబయ్యపల్లి, యాశ్వాడ, చాకలివానిపల్లి, గోపాల్‌పూర్, పీచుపల్లి, చీమలకుంటపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గన్నేరువరం, బెజ్జంకి ఉమ్మడి మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ ప్రారంభించారు.

సమగ్ర సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



మానకొండూర్‌లో మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీధర్

మానకొండూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్డీవో వి శ్రీధర్ అన్నారు. మానకొండూర్‌లోని రైతువేదికలో సోమవారం సమగ్ర సర్వేపై ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే ఈ నెల 6 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఎన్యుమరేటర్ రోజుకు పది కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంటుందన్నారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీవో పుల్లయ్య ఆధ్వర్యంలో ఎన్యుమరెటర్లకు సమగ్ర కుటుంబ సర్వేపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాణి పాల్గొన్నారు.

● గంగాధర: ఎంపీడీవో సమావేశ మందిరంలో సమగ్ర సర్వే ఎన్యూమరేటర్లకు జడ్పీ సీఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాము, ఎంపీవో జనార్ధన్‌రెడ్డి,డీటీ వినయ్‌కుమార్, ఎన్యూమరేటర్లు, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.

● శంకరపట్నం: మండలంలోని మోడల్ స్కూల్‌లో ఎంపీడీవో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రభాకర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

శంకరపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలోని విద్యార్థునులకు హుజూరాబాద్ గంగిశెట్టి మధురమ్మ ట్రస్టు సభ్యులు సోమవారం పరీక్ష ప్యాడ్లు పెన్నులు పంపిణీ చేశారు. గంగిశెట్టి మధురమ్మ ట్రస్టు సభ్యుడు దయాకర్ జ్ఞాపకార్థం పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేసినట్లు బాధ్యులు తెలిపారు.

వ్యాసరచన పోటీలు

కరీంనగర్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రిన్సిపల్ మాలతి ఆధ్వర్యంలో శకుంతల దేవి 95వ జయంతి వేడుకల సందర్భంగా గణిత శాస్త్ర విభాగం వారు విద్యార్థినిలకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ మాలతి, గణిత శాస్త్ర విభాగం అధ్యాపకులు ఎస్ పద్మజ, ఏం రాధిక, కె రాధిక, డా. జి సుమతి, డి మమత పాల్గొన్నారు.

'సీనియర్ అధికారులతో విచారణ జరిపించండి'

కరీంనగర్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరిన 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలతచంద్రశేఖర్‌ను మేయర్ సునీల్‌రావు, కమిషనర్ చాహత్ భాజ్‌పాయి అవమానించిన సంఘటనపై, ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు వెళితే చులకన చేసి మాట్లాడిన కమిషనర్‌పై వెంటనే సీనియర్ ఐఎఎస్‌లతో విచారణ జరిపించి న్యాయం చేయాలని మాజీ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్ జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌ను కోరారు. ఈమేరకు సోమవారం కరీంనగర్ ఆర్అండ్‌బి గెస్ట్‌హౌజ్‌లో ఆయనను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లుగా చంద్రశేఖర్ తెలిపారు.

మాల మహానాడు కమిటీ

భగత్‌నగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల మాల మహానాడు కమిటీని సోమవారం జిల్లా అధ్యక్షుడు కాడె శంకర్ ప్రకటించారు. మండల అధ్యక్షులుగా గుంటపల్లి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా చంద్రపల్కల స్వామి, గౌర అద్యక్షుడు అంకాల హన్మాండ్లు, గొర్రె రవీందర్, ఇనుగంటి కరుణాకర్, పండుగ అనిల్ బొబ్బిటి నారాయణ, పండుగ సాయిక్రిష్ణ, కాడె నిఖిల్ ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుక ఆంజనేయులు, తాళ్ల వెంకటేష్, దామెర సత్యం, సుంకె రాజు, చంద్రపల్కల అజయ్, కారం ఆంజనేయులు, కోడిరవి, ముచ్చె మల్లయ్య పాల్గొన్నారు.